**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన "ముస్లింల హక్కుల పరిరక్షణపై న్యూఢిల్లీ డిక్లరేషన్" విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ముస్లింలతో పాటు ఇతర బలహీన వర్గాల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, ఓటరు హక్కుల రక్షణ వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితాల సవరణ ( SIR) ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేసిన పలువురు నాయకులు, ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు రక్షించబడేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు మరియు ఇతర బలహీన వర్గాలకు చెందిన ఓటర్ల హక్కులు ఎలాంటి అన్యాయానికి గురికాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడి హక్కులను కాపాడటం ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క బాధ్యత అని ఆయన అన్నారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం మరియు సమానత్వాన్ని పరిరక్షించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జమ్మూ & కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, మాజీ రాజ్యసభ సభ్యుడు మహమ్మద్ అదీబ్, మాజీ కేంద్ర విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు పలువురు ప్రముఖులు, మేధావులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మరియు ముస్లిం సమాజ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తంగిరాల మాధవీదేవి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గడి ప్రవీణ్ కుమార్ లకు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తులు ముందుగా స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకుని, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి జీవీఎన్.భరత లక్ష్మి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, సీ.పీ, అదనపు కలెక్టర్ తదితరులతో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.

## ఎమ్మార్పీఎస్ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

### క్యాసగల్ల రమేష్ మాదిగ

**ఆలేరు, విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన క్యాసగల్ల రమేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ ప్రభాత్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నూతన రాష్ట్ర, జాతీయ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ మాదిగ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మంచాల యాదగిరి ఆధ్వర్యంలో నూతన కమిటీలను ప్రకటించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాసగల్ల రమేష్‌మాదిగను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడంపై నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ మాదిగలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతి హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని రమేష్ మాదిగ పేర్కొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించం



- నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు గుగులోతు రవినాయక్, రాష్ట్ర కార్యదర్శి ధారావత్ భాస్కర్ నాయక్ డిమాండ్

**కురవి విశాల భారతి:**

విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని బీఆర్ఎస్వీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు, యువజన రాష్ట్ర నాయకుడు గుగులోతు రవినాయక్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ధారావత్ భాస్కర్ నాయక్ హెచ్చరించారు. కురవి మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, నీట్ (జాతీయ అర్హత మరియు ప్రవేశ పరీక్ష) ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, కుట్రకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు రాత్రింబవళ్లు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని, వారి జీవితాలతో చెలగాటం ఆడే వారిని ఏ మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను అమలు చేయాలని కోరారు. యువత, విద్యార్థులు తలచుకుంటే ప్రభుత్వాలనే మార్చిన చరిత్ర ప్రపంచంలో ఎన్నో ఉందని పేర్కొంటూ, ఈజిప్ట్, ఉగాండా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో విద్యార్థి ఉద్యమాలు ప్రభుత్వాలను కుదిపేశాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనలను నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ కోరుతూ 25 రోజులుగా దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విద్యార్థుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అమానుషమని మండిపడ్డారు. దేశంలోని సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేసిన వారు, నీట్ వ్యవహారంతో నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి బండి దీపక్ గౌడ్, మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి మొలకల నరేష్, బీఆర్ఎస్వీ నాయకులు బానోత్ గణేష్, మాలోత్ సూర్య నాయక్, బాదావత్ సురేష్, బానోత్ యుగంధర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడ్డాడంటూ ఆర్ అండ్ బి అధికారిపై ఫిర్యాదు

- కుల దూషణ ఆరోపణలతో చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- "నేను డి.ఈ." అంటూ అధికార దర్పం ప్రదర్శించాడని బాధితుడి ఆరోపణ.
- రామచంద్రు తండా రైతుతో అసభ్యంగా ప్రవర్తించారంటూ ఆవేదన.
- వాస్తవాలు వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.
- ఆర్ అండ్ బి శాఖ పేరును ఉపయోగించి బెదిరింపులకు పాల్పడ్డాడా?
- సమగ్ర విచారణ కోరుతున్న బాధితుడు
- "నేను ఆర్ అండ్ బి డి.ఈ.ను" అంటూ అధికార దర్పం ప్రదర్శించాడని బాధితుడి ఆరోపణ
- నిష్పక్షపాత విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడి డిమాండ్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**



మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలో ఓ వ్యక్తి తనను ఆర్ అండ్ బి శాఖ డివిజనల్ ఇంజినీర్ (డి.ఈ.)నని చెప్పుకుంటూ అధికార దర్పంతో ప్రవర్తించడమే కాకుండా, కులం పేరుతో దూషించి, అసభ్య పదజాలంతో అవమానించాడని బాధితుడు బాదవత్ భాస్కర్ నాయక్ ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, చిన్నగూడూరు మండలం జయ్యారం-పోయే ప్రధాన రహదారి సమీపంలోని రామచంద్రు తండాలో తనకు వ్యవసాయ భూమి ఉందన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి తాను ఆర్ అండ్ బి శాఖ డి.ఈ.నని పరిచయం చేసుకుంటూ తనతో దురుసుగా ప్రవర్తించాడని ఆరోపించారు. ఎలాంటి కారణం లేకుండానే తనను అవమానిస్తూ, కులం పేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడ్డాడని భాస్కర్ నాయక్ తెలిపారు. అంతేకాకుండా, "నేను ఆర్ అండ్ బి డి.ఈ.ను... నువ్వెవరు?" అంటూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని మాట్లాడాడని, తనను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించాడని ఆయన ఆరోపించారు. కులాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో తన మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తనను ఆర్ అండ్ బి డి.ఈ.నని చెప్పుకుంటూ తిరుగుతున్న ఆ వ్యక్తి నిజంగా ప్రభుత్వ అధికారేనా? అయితే ఆయన ప్రవర్తనపై శాఖాపరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదనే అంశంపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వ అధికారి కాకపోతే, తప్పుడు హోదా చెప్పుకుని ప్రజలను బెదిరిస్తున్న విషయంపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, అందువల్ల పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని నిష్పక్షపాత విచారణ నిర్వహించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా కేటిఆర్ జన్మదిన వేడుకలు



**చిట్యాల విశాల భారతి:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోనీ 10వార్డుకి చెందిన యువ నాయకులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు ,పలకలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రవీణ్,ఎస్కే ఇబ్రహీం, బొడ్డుపల్లి శ్రీను,సిలివేరు రిశ్వంత్, బొడ్డుపల్లి ఉపేందర్,గూడ అఖిల్, బొడ్డుపల్లి శ్రీశాంత్,ఎస్కే ఉస్మాన్, నరముల శివ, పల్లపు శ్రీకాంత్,తిరు పాల రాంచరణ్,శివాజీ తదితరులు పాల్గొనారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి




**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండల కేంద్రంలో గల ఉజ్వల హైస్కూల్ లో శనివారం విద్యార్థి నాయకుల పదవి స్వీకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈనెల 23న పాఠశాలలో నిర్వహించిన నాయకత్వ ఎన్నికలలో హెడ్ బాయ్ గా గజం తనుజ్, హెడ్ గర్ల్ గా అల్లకుండా స్నేహమయి, స్పోర్ట్స్ కెప్టెన్ గా గూండ్ల రాజేష్, కల్చరల్ హెడ్ గా జంగిలి అ శ్వంత్, డిసిప్లిన్ హెడ్ గా ఉప్పరి రిశ్వంత్ ఎన్నికయ్యారు పదవి స్వీకరణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి అవధూత గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు సాధారణంగా వ్యాపార దృక్పథంతో నడుస్తున్న ఈ కాలంలో ఉజ్వల హై స్కూల్ యాజమాన్యం విద్యార్థుల సమగ్ర అభివృద్ధి విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థి నాయకులకు క్రమశిక్షణ, బాధ్యత, సేహభావం మరియు పరస్పర గౌరవంతో విధులు నిర్వహించాలని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజురి అరుణ్ కుమార్, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లా కోర్టును సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తంగిరాల మాధవి దేవి

### న్యాయవ్యవస్థ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలపై బార్ అసోసియేషన్ వినతి



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** నిజామాబాద్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తంగిరాల మాధవి దేవి శనివారం నిజామాబాద్ జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి జిల్లా కోర్టు పరిసరాలు, కోర్టు భవనంలోని సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠం రాములు, ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆవుల నారాయణలు జస్టిస్ తంగిరాల మాధవి దేవిని మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో పెరుగుతున్న కేసుల దృష్ట్యా అవసరమైన న్యాయమూర్తుల పోస్టులను మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనానికి అదనంగా మూడో, నాలుగో అంతస్తుల నిర్మాణానికి సహకరించాలని కోరారు. అలాగే జిల్లా ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, నిజామాబాద్ జిల్లా బీంగల్ ప్రాంతంలో జూనియర్ సివిల్ జడ్జి & ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ను మంజూరు చేసినందుకు హైకోర్టుకు జిల్లా న్యాయవాదుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యురాలు పరిపూర్ణ సీనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి, ఆల్గోట్ రవీందర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్ గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామెర అనిల్‌కు గ్రామస్తుల వినతి



**దేవరుప్పుల విశాల భారతి :** మండలం రాంబోజిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ గ్రామ ప్రజలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామెర అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, మహిళా సంఘం భవనం నిర్మించాలని, పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని దామెర అనిల్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడ కొండయ్య, వార్డు సభ్యురాలు రాంపల్లి పుష్ప, బీసీసీఎల్ అధ్యక్షుడు మొలుగూరి సంతోష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి నవీన్, గ్రామ ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీధర్, మొలుగూరి యాకయ్య, రాంపల్లి మల్లేష్, రాంపల్లి వెంకన్న, గొడుగు లక్ష్మయ్య, గొడుగు గోపి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి( ఎన్ హెచ్930పి )ని పరిశీలించిన ప్రాజెక్టు మేనేజర్

**తిరుమలగిరి, విశాలరహదారి భారతి :** మండల పరిధిలో జాతీయ 930పి ) పై బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి శనివారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. తిరుమలగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నేషనల్ హైవే ప్రాజెక్ట్ మేనేజర్ బి. రామ్‌కుమార్, తొండ గ్రామ సర్పంచ్ శ్రీమతి బి. స్వాతి, మరియు అనంతారం గ్రామ వార్డు కౌన్సిలర్ గొడిశాల అంజయ్య గౌడ్‌లతో కలిసి సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా తొండ గ్రామం మరియు అనంతారం స్టేజ్ వద్ద గల జాతీయ రహదారి దిగ్బంధన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చేపట్టాల్సిన తాత్కాలిక మరియు శాశ్వత నివారణ చర్యలపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు గాను సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు వేగవంతంగా తీసుకుంటున్నట్లు తిరుమలగిరి పోలీస్ వర్గాలు తెలిపాయి.



# మిమ్స్ డాక్టర్ల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- వైద్యం వికటించి మరణించిన దంతుల బోరు సర్పంచ్
- డాక్టర్ మోహన్ రావు బాధ్యత వహించాలని బాధితుల డిమాండ్
- పాల్వంచ మండలం దంతిలబోరు గిరిజన సర్పంచ్ సోడే వెంకటరమణ
- మృతి పట్ల కారణాలను విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్
- కాలు ఆపరేషన్‌కి గిరిజన మహిళ ప్రాణం తీస్తారా
- న్యాయం కోసం సిపిఐ నాయకులు కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు ధర్నా
- పోలీస్ బందోబస్తుతో సంబంధిత డాక్టర్ మోహన్ రావు ముందస్తు అప్రమత్తత



**భద్రాచలం, విశాల భారతి;** భద్రాచలం అంబేద్కర్ సెంటర్ నందు ఉన్న మిమ్స్ హాస్పిటల్ నందు పాలవంచ మండలం దంతుల బోరు గ్రామానికి చెందిన యువ మహిళ గిరిజన సర్పంచ్ సోడే వెంకటరమణ వైద్యం వికటించి మరణించడం జరిగింది. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు కాలు వాపు కారణంగా హాస్పిటల్ కి వచ్చామని మంచిగున్న యువ గిరిజన సర్పంచ్ సోడె వెంకటరమణ ను మూడు రోజులు హాస్పిటల్లో ఉంచి ఆపరేషన్ చేయాలని చెప్పి ఆపరేషన్ కి ప్రిపేర్ చేసి మొత్తం ఇంజక్షన్ ఇచ్చిన తదుపరి ఆమె స్పృహ కోల్పోయి మరణించిందని బాధితులు వాపోతున్నారు. వైద్యుల నిర్లక్ష్యం తోటే మరణించిందని గిరిజన మహిళ యువ సర్పంచ్ సోడె వెంకటరమణ ఇంజక్షన్ వికటించి మృతి చెందిందని బాధితులు ఆరోపిస్తున్నారు. నవ్వుతూ మంచిగా వచ్చిన ఆమెను చంపారని దీనికి కారణం డాక్టర్ మోహన్ రావు బాధ్యత వహించాలని మృతి చెందిన బాధితులు హాస్పిటల్ ముందు ధర్నాకి దిగారు. ఇటువంటి సంఘటనలు ఈ హాస్పిటల్ లో తరచుగా జరుగుతున్నాయని ఏజెన్సీలో వైద్యులు నిర్లక్ష్యం కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయని బాధితులు వారి గోడు వెళ్ళబోసుకుంటున్నారు. సోడే వెంకటరమణ మరణానికి కారణమైన వైద్యులను తక్షణమే అరెస్టు చేయాలని ఆమెకు జరిగిన అన్యాయం ఏ ఒక్కరికి జరగకూడదు అని సిపిఐ నాయకులు వారి వాదన వినిపించారు ఇటువంటి సంఘటనలు జరగటం దురదృష్టకరమని వైద్యులు తమ విధులు నిర్వహించడంలో అలసత్వం చోటు చేసుకుంటుందని డబ్బులు మీదున్న శ్రద్ధ వచ్చిన పేషంట్ల పైన ఉండటం లేదని దీనిపైన ఉన్నత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని జరిగిన సంఘటన పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తూతూ మంత్రంగా చేస్తే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వచ్చిన నాయకులు ప్రసంగించారు. తక్షణమే ఉన్నతాధికారులు హాస్పిటల్ సీజ్ చేసి జరిగిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని స్థానిక ప్రజలు ప్రజాతంత్ర వాదులు సంఘాల వారు డిమాండ్ చేస్తున్నారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న జగన్



**సికింద్రాబాద్, విశాలభారతి:** సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాల మేరకు నిర్వహించిన సర్ కార్యక్రమంలో సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంగ జగన్ పాల్గొనడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో సుజాత,సులోచన, చింతకింది మల్లేష్, సుమతి, శివ, దిండిగల శ్రీకాంత్, కర్ణాకర్ చారి, వినోద్,తౌటం సతీష్, ఒగ్గు శ్రీధర్, గంపేట రాజు తదితరులు పాల్గొన్నారు

## మై హోమ్ అవతార్–ముస్కి చెరువు సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** మై హోమ్ అవతార్ జంక్షన్ మరియు ముస్కి చెరువు పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై స్థానిక నివాసితులు సెరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ, ఐఏఎస్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నివాసితుల తరఫున గౌతమ్, రవీంద్ర చారి, అయ్యప్ప రెడ్డి పాల్గొన్నారు. వినతిపత్రంలో ప్రధానంగా ముస్కి చెరువులోకి మురుగునీరు చేరకుండా వెంటనే సెవరేజ్ డైవర్షన్ పనులు చేపట్టాలని కోరారు. అలాగే మై హోమ్ అవతార్ జంక్షన్ నుండి సమీప దేవాలయం వరకు రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, జంక్షన్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇక సర్వే నం. 276లో ఉన్న 72 ఎకరాలు 21 గుంటల భూమిని "తెలంగాణ యూనిటీ పార్క్"గా ప్రకటించి ప్రజలకు అందుబాటులో ఉండే గ్రీన్ పార్క్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. పరిసర అపార్ట్‌మెంట్లకు తగిన మున్సిపల్ తాగునీటి సరఫరా కల్పించడంతో పాటు చెరువు కట్ట వెంట స్థానిక వృక్షాలతో విస్తృతంగా మొక్కల నాటకం చేపట్టాలని కోరారు. అదనంగా వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచి ఆటోమేటిక్ టైమర్లతో సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, రోడ్ల శుభ్రత, డ్రైనేజీ వ్యవస్థ, పాదచారుల మార్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యలను జోనల్ కమిషనర్ సానుకూలంగా స్వీకరించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో మై హోమ్ అవతార్-ముస్కి చెరువు పరిసరాలను పరిశుభ్రమైన, హరితమైన, సురక్షిత ప్రాంతంగా అభివృద్ధి చేయాలని నివాసితులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మొండి గౌరెల్లి అసైన్డ్ రైతులు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా

- 19,68 127 సర్వే నెంబర్‌లో మళ్లీ రీ సర్వే చేయాలి
- రైతులకు న్యాయం చేస్తానని హామీ ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి



**విశాలభారతి ఇబ్రహీంపట్నం:** 19,68, 127 సర్వే నంబర్లలో చేసిన సర్వే తప్పుగా ఉందని, సరైన పరిహారం ఇవ్వాలని మొండి గౌరెల్లి అసైన్డ్ భూమి రైతులు శనివారం యాచారం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి, ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మర్పల్లి అంజయ్య, తాండ్ర రవీందర్, బండి మీద కృష్ణ, ఉపసర్పంచ్ బడే కుమార్ మొండి గౌరెల్లి గ్రామస్తులు గంటన్నర పాటూ ఎమ్మార్వో కార్యాలయం ముందు బటాయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ మా భూములు మాకే కావాలని, 19,68, 127 సర్వే నెంబర్లను మళ్లీ రీ సర్వే చేయాలని, కబ్జాలో ఉన్నవారికి, ఎస్సీ ఎస్టీ బీసీ రైతులకు నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయాలని అధికారులను హెచ్చరించారు. ఇక్కడున్న ఎమ్మార్వో ప్రత్యేకంగా మొండి గౌరెల్లి రైతులకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి తో ఫోన్లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. తదనంతరం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయానికి రైతులు చేరుకొని ఆర్డీవో శ్రీనివాసరెడ్డి ని కలిశారు. ఆర్డీఓ రైతులతో మాట్లాడుతూ మీకు ఎలాంటి అన్యాయం జరగకుండా కలెక్టర్ తో సమయం తీసుకుని, గ్రామ సర్పంచ్ కు సమాచారం ఇచ్చి, మీ సమస్యలు చెప్పుకోవాలని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అయ్యప్ప, ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి, ఎస్ ఐ లు మధు, ప్రియాంక, రెవెన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థ ప్రక్షాళనకు తొలి అడుగు

**ఢిల్లీ, విశాలభారతి:** నీట్ పేపర్ లీక్, పరీక్షల అక్రమాలపై జంతర్‌మంతర్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులను శనివారం కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కలిశారు. నిరాహారదీక్షలో ఉన్న విద్యార్థులతో మాట్లాడిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అరెస్టులు చేసినా, బెదిరించినా విద్యార్థులు ఉద్యమం నుంచి వెనక్కి తగ్గబోరని స్పష్టంచేశారు. విద్యార్థులు ప్రభుత్వం ముందు మూడు రాజీలేని డిమాండ్లు పెట్టారని రాహుల్ తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించడం, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కి బాధ్యులపై చర్యలు తీసుకోవడం, ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పడం తప్పనిసరని పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మరో శాఖకు మార్చడం పరిష్కారం కాదని, ఆయన్ను పూర్తిగా మంత్రి పదవి నుంచి తొలగించాల్సిందేనని రాహుల్ స్పష్టంచేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన వ్యవస్థకు ఆయన ప్రతీకగా మారారని, అందుకే ఆయనపై చర్య తప్పనిసరని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్ ప్రయోగంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారని రాహుల్‌గాంధీ చెప్పారు. ఢిల్లీ యూనివర్సిటీ, జేఎన్‌యూ వంటి విద్యాసంస్థలు విద్యార్థులను నిరసనల్లో పాల్గొనవద్దని హెచ్చరిస్తున్నప్పటికీ భయపడాల్సిన అవసరం లేదని వారికి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. 'మీపై ఎంత ఒత్తిడి తెచ్చినా వెనక్కి తగ్గొద్దు. విద్యార్థులే దేశ భవిష్యత్తు. భవిష్యత్తును ఎవరూ అడ్డుకోలేరు' అని రాహుల్‌గాంధీ అన్నారు. అంతకుముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ప్రధాన్ రాజీనామాతో దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందని వ్యాఖ్యానించారు.

## స్మశాన వాటిక దారిలోనే 'మృత్యువు'.. కాలువలో విరిగిన విద్యుత్ స్తంభం

**ఏడాదిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు!**



**మునగాల, (విశాలభారతి):** సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరింది. గ్రామ స్మశాన వాటిక సమీపంలో, ప్రధాన బీటీ రోడ్డు పక్కనే ఉన్న పెద్ద కాలువలో ఒక ప్రధాన విద్యుత్ స్తంభం కింది భాగం పూర్తిగా విరిగిపోయి, నీటిలోనే గాల్లో వేలాడుతున్నట్లుగా అత్యంత ప్రమాదకర స్థితికి చేరినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏడాదిగా అదే పరిస్థితి : గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలు, కాలువలో వచ్చిన వరద ధాటికి ఈ సిమెంట్ కరెంట్ స్తంభం అడుగు భాగం పూర్తిగా విరిగిపోయింది. దాదాపు ఒక సంవత్సరం కాలంగా ఈ స్తంభం ఇదే విధంగా కాలువలో విరిగిపోయి ఉన్నప్పటికీ, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు మాత్రం కంటి తుడుపుగానైనా అటువైపు చూడకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సపోర్ట్ స్తంభంపైనే భారం: ప్రస్తుతం ఈ ప్రధాన విద్యుత్ స్తంభానికి కింద భూమితో ఎలాంటి పట్టు లేదు. కాలువలో పడిపోకుండా కేవలం పక్కనే ఉన్న సపోర్ట్ స్తంభం, మరియు పైన ఉన్న హైవోల్టేజ్ కరెంట్ తీగల పట్టు వల్లనే ఇది ఎలాగోలా ఆగి ఉంది. ఈ తీగలు ఏమాత్రం తెగినా, ఆ కరెంట్ అంతా కాలువ నీటిలో ప్రవహించి ఊహించని రీతిలో ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంది. భయాందోళనలో రాకపోకలు: బీటీ రోడ్డుకు ఆనుకుని, స్మశాన వాటికకు వెళ్లే ముఖ్యమైన దారిలోనే ఈ కాలువ, స్తంభం ఉండటంతో నిత్యం ఇటుగా జనం, వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. చుట్టుపక్కల పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు నిత్యం ఈ కాలువ గట్టున నడవాల్సి వస్తోంది. గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం జనం గుంపులుగా వెళ్లాల్సి వస్తుంది. అటువంటి సమయంలో ఈ స్తంభం ఎక్కడ నెత్తిన పడుతుందో, లేదా కాలువలో కరెంట్ షాక్ కొడుతుందోనని ప్రజలు గుండె చేతుల్లో పట్టుకుని తిరుగుతున్నారు. ప్రస్తుతం మళ్లీ వర్షాలు పడుతుండటంతో కాలువలో నీటి ప్రవాహం పెరిగి, ఈ విరిగిన స్తంభం ఏ క్షణంలోనైనా కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

**పెద్ద ప్రమాదం జరక్కముందే స్తంభాన్ని మార్చాలి**

"బీటీ రోడ్డు పక్కనే ఉన్న పెద్ద కాలువలో ఈ స్తంభం విరిగిపోయి ఏడాది అవుతోంది. ఇటుగా మా పొలాలకు వెళ్లాలన్నా, స్మశాన వాటికకు వెళ్లాలన్నా భయమేస్తోంది. కరెంట్ తీగలు బలంగా లాగి పట్టుకోవడం వల్లే ఆ స్తంభం ఆగింది. కాలువలో నీళ్లు ఉన్నప్పుడు అది పడిపోతే చుట్టుపక్కల వాళ్లంతా ప్రాణాలు కోల్పోతారు. అధికారులు ఎవరూ అటువైపు వచ్చి చూడటం లేదు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాక వస్తారా? ఇప్పటికైనా కొత్త స్తంభం వేసి మమ్మల్ని కాపాడాలి."- తాడ్వాయి గ్రామ రైతులు, స్థానికులు.*

## మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్‌లు

- మధుయాష్కి గౌడ్
- యువతపై పోలీసులతో అణిచివేత, రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తనకు నిరసనగా ఎల్బీనగర్లో భారీ బైక్ ర్యాలీ

**ఎల్బీనగర్ విశాల భారతి :** మోడీ ప్రభుత్వ హాయంలో దేశంలో 152 సార్లు పేపర్ లీక్ సంఘటనలు జరిగినా .. ఒక్కరికి శిక్ష పడకపోకపోవడం సిగ్గుచేటని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ లకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఆందోళనలకు మద్దతుగా నిరసన చేపట్టిన రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తన, అరెస్ట్ ను నిరసిస్తూ మధుయాష్కి నేతృత్వంలో ఎల్బీనగర్ లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. వనస్థలిపురంలోని సుష్మ చౌరస్తా నుంచి వనస్థలిపురం మీదుగా ఎల్బీనగర్లోని అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్ లు జరుగుతున్నాయని విమర్శించారు. గతంలో పేపర్ లీక్ సంఘటనల్లో నిందితుల్లో ఉన్నవారికి క్లీన్ చిట్ ఇచ్చి వదిలేసారని విమర్శించారు. పేపర్ లీక్ కు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న యువతపై మోడీ ప్రభుత్వం పోలీసులతో క్రూరంగా కొట్టించడమే కాకుండా.. విద్యార్థునులపై అసభ్యకరంగా, అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. నీట్ పేపర్ లీక్ తో 22 లక్షల మంది విద్యార్థులు వారి కుటుంబాలు ఆవేదనకు లోనయ్యా అన్నారు, మనోవేదనతో పలువురు విద్యార్థులు ఆధ్వర్యంలో చేసుకున్నారని ఆ కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థులకు అండగా నిలబడి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం పార్లమెంటులోనూ, బయట ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంటులో రాజ్యసభలో పేపర్ లీక్ లపై చర్చ జరగాలని పట్టుబడుతున్నా.. మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన ఆగదన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే కాకుండా.. చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాల్సిందనని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ కష్టార్జితంతో పిల్లలను చదివిస్తుంటే... పేపర్ లీక్ లతో విద్యార్థుల భవిష్యత్తును మోడీ ప్రభుత్వం నాశనం చేస్తుందని విమర్శించారు. దేశంలో విద్యా వ్యవస్థను కూడా నాశనం చేస్తుందని.. మోడీ ప్రభుత్వ హయంలో దేశంలో లక్షలల పాఠశాలలు మూతపడ్డాయని విమర్శించారు. విద్యార్థుల పక్షాన నిలబడి రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి పోరాడుతున్నారని.. విద్యార్థులు ఎవరు ఆందోళన చెందవద్దని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## శంషాబాద్‌లో హిట్ అండ్ రన్ ప్రమాదం – అస్సాం కార్మికుడు మృతి

**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై మదనపల్లి పాత తండా యూటర్న్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అస్సాం రాష్ట్రానికి చెందిన కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ డి. చెన్నయ్య, పెట్రోల్ మొబైల్ డ్రైవర్ ఎం. యాదగిరితో కలిసి జూలై 24న ఉదయం నుండి రాత్రి వరకు పెట్రోలింగ్ విధుల్లో ఉన్నారు. సాయంత్రం సుమారు 5:40 గంటలకు డయల్ 100 కాల్ ద్వారా ప్రమాద సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలతో ఒక వ్యక్తి మృతదేహం రోడ్డుపై పడివుండటం గమనించారు. పక్కనే లభించిన మొబైల్ ఫోన్ ద్వారా అతని కుటుంబ సభ్యులను సంప్రదించగా, మృతుడు అర్జున్ భూమిజ్ (31)గా గుర్తించారు. ఇతను అస్సాం రాష్ట్రం సోనిత్‌పూర్ జిల్లా నివాసి కాగా, ఉపాధి కోసం ఐదు రోజుల క్రితం జడ్చర్లకు వచ్చినట్లు తెలిసింది. డబ్బులు అయిపోవడంతో కాచిగూడ రైల్వే స్టేషన్ నుండి జడ్చర్ల వైపు నడుచుకుంటూ వెళ్తుండగా, రహదారి దాటే క్రమంలో శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం అతన్ని ఢీకొట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం అనంతరం వాహనం డ్రైవర్ అక్కడి నుండి పారిపోయినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్ర రక్తస్రావం కావడంతో అర్జున్ భూమిజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు శంషాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి తెలిపారు. గుర్తుతెలియని వాహనం మరియు డ్రైవర్‌ను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

## సెప్టెంబర్ 8న ఛలో హైదరాబాద్ మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ

**ఎంఎస్ఎఫ్ నూతన నిర్మాణాలతో మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ: మంద కృష్ణ మాదిగ**



**సికింద్రాబాద్, విశాలభారతి :** ఎంఎస్ఎఫ్ జాతీయ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం వారాసిగూడలోని వైభవ్ ఇంపీరియల్ హాల్లో ఎమ్మెస్ ఎఫ్ మాజి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కు జాతీయ, రాష్ట్ర, జిల్లాల, అన్ని యూనివర్సిటీలలో ఎమ్మెస్ ఎఫ్ నూతన నిర్మాణాలను తక్షణమే 40 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని, నూతన బాధ్యులతో ఎమ్మెస్ ఎఫ్ ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ నా భూతో నా భవిష్యత్ అనే రీతిలో సెప్టెంబర్ 8న హైదరాబాద్ లో నిర్వహించబోతున్నట్లు తెలియజేశారు. వివిధ జిల్లాల ప్రతినిధులతో వారి వారి జిల్లాలో ఉద్యమ స్థితిగతులపై,భవిష్యత్ కార్యాచరణ అమలుపై మందకృష్ణ మాదిగ సమీక్షించారు.ఇచ్చిన కార్యాచరణ తమ తమ జిల్లాలో అమలు చేసే బాధ్యత జిల్లా నాయకత్వం తీసుకోవాలని, అదేవిదంగా వారిపై ఇంచార్జీలుగా రాష్ట్ర, జాతీయ నాయకత్వం వ్యవహరించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎమ్మెస్ ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై కార్యాచరణ ప్రకటించి పేద వర్గాల విద్యార్థుల పక్షాన పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పుల్ల శ్రీనివాస్ మాదిగ,సందే కార్తీక్ మాదిగ, బాయికటి బెనర్జీ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ,బొచ్చు తిరుపతి మాదిగ, బిక్కి మురళి కృష్ణ మాదిగ, బైరపోగు శివ కుమార్ మాదిగ, పరశురామ్ మాదిగ,చేడుపల్లి రఘువరన్ మాదిగ, బుక్కపురం మహేష్ మాదిగ, ఎడేళ్లి అజయ్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ జాతీయ నాయకత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకత్వం, వివిధ జిల్లాల నాయకత్వం పాల్గొన్నారు..

## విద్యా విధానంలో ఆదివాసి ఎరుకల విద్యార్థులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలి

- ఆదివాసీల సంక్షేమం అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ఆధ్వర్యంలో
- ట్యాంక్ బండ్ పై ఏకలవ్యుని జయంతి ఉత్సవాలు
- భారీగా హాజరైన ఆదివాసీలు



**ముషీరాబాద్, విశాల భారతి:** ఇతర ఆదివాసి గిరిజన విద్యార్థులతో పోల్చుకుంటే ఆదివాసి ఎరుకల విద్యార్థులు విద్యలో చాలా వెనకబడి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో ఆదివాసి ఎరుకల విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్ బండ్ పైన కొమరం భీమ్ విగ్రహం వద్ద ఏకలవ్యుని జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ఆదివాసి సంఘాల ప్రతినిధులు భారీగా హాజరై పూలమాలను సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు లోకిని రాజు,కూతాడి రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే విలు విద్యలో ఏకలవ్యుని మించిన వారు ఎవరూ లేరని, ఆయన వారసులుగా పిలవబడుతున్న ఎరుకల జాతి త్యాగానికి మారుపేరు అని అన్నారు. కానీ నేడు మైదాన ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగిన ఎరుకల ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలోని ఎరుకల జాతిని గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాదాక్షులుగా, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జిగా నైషేధం సత్యనారాయణ మూర్తి నియామకం




**ముషీరాబాద్, విశాల భారతి:** ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. శనివారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సమావేశంలో ఫెడరేషన్ జాతీయ సెక్రెటరీ జనరల్ ద్రోణం రాజు రవికుమార్, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాదులు సత్యనారాయణమూర్తికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ద్రోణం రాజు రవికుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక, రాజకీయ భవిష్యత్‌కు భరోసా కల్పించేలా అల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధి కోసం బ్రాహ్మణ పరిషత్ కు రాష్ట్రప్రభుత్వం 100 కోట్ల రూపాయల వెంటనే మంజూరు చేయాలని కోరారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి, వారికి జరుగుతున్న అన్యాయాలపై అల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నిరంతరం పోరాడుతుందని, బ్రాహ్మణులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో బ్రాహ్మణులకు ఏ రాజకీయ పార్టీ కూడా సముచిత ప్రాధాన్యత కల్పించడం లేదని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 33 మంది బ్రాహ్మణ ఎమ్మెల్యేలు ఉండగా, ప్రస్తుతం తెలంగాణలో ఆ సంఖ్య ఒక్కరికే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, తగిన నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని చెప్పారు. అలాగే ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం నాలుగు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాలను కలుపుకొని తమ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి నారాయణ శర్మ, కార్యదర్శులు వారణాసి వంశీ, ఒక్క లంక శ్రీనివాసరావు, సభ్యులు ఆకెళ్ళ సుబ్బలక్ష్మి, జయ తులసి తదితరు పాల్గొన్నారు.

# సీతారామ సేద్యానికి సుక్క నీరేది..





- ఎల్ ని నోతో ప్రశ్నార్ధకంగా మారిన వరి సాగు
- తలాపనే గోదారున్నా నీళ్లు లేక సేద్యం బంద్
- ఆగస్టు నాటికి సీతారామ నీళ్లు తుమ్మలచెరువుకు కష్టమే

**అశ్వాపురం, విశాల భారతి :**

గోదావరి నదిపై సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం కోసం సుమారు రెండు దశాబ్దాల కాలంగా పోరాటాలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వామపక్ష పార్టీలు గోదావరిపై ప్రాజెక్టును నిర్మించాలని ఏళ్ల తరబడి వివిధ రూపాలలో పోరాటాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చివరకు వైయస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సుమారు రూ. 1681 కోట్ల అంచనా వ్యాయామంతో రాజీవ్ సాగర్ దుమ్ముగూడెం ప్రాజెక్టును నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి అట్టహాసంగా పనులను ప్రారంభించారు. వైఎస్సార్. కొంతమేరకు పనులు కూడా జరిగాయి. కొన్ని పరిణామాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రంగా విభజన కావడం బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు సారధ్యంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు కాస్త సీతారామ ప్రాజెక్టుగా రూపుదిద్దు పోవడం జరిగింది. ప్రాజెక్టు పనులను పూర్తి చేసుకొని నీళ్లు కూడా గోదావరి నుండి కాలువ ద్వారా బిజీ కొత్తూరు పంప్ హౌస్ కు అక్కడి నుండి పక్క జిల్లా అయినా ఖమ్మం ఆయకట్టు రైతులకు చేరుతున్నాయి. కానీ ప్రాజెక్టు కోసం భూములు ధారాదత్తం చేసిన ఇక్కడి రైతుల కు సేద్యానికి సుక్క నీరు కూడా దక్కకపోవడం విచారించదగ్గ విషయం.

**సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ చేసేటప్పడే మండలానికి సాగునీరు పరిస్థితి పై గళ మెత్తాల్సింది :**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయ్యాంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టును డిజైన్ మార్చి సీతారామ ఎత్తిపోతల పథకంగా మార్చారు. ఈ ప్రాజెక్టు కోసం రైతుల దగ్గర నుండి పెద్ద ఎత్తున భూసేకరణ కూడా చేశారు. రైతులు కూడా తమకు సాగునీరు వస్తుందన్న ఆశతో భూములు ఇచ్చేశారు. ఈ తరుణంలో అశ్వాపురం మండలంలోని గోదావరి నుండి నీళ్లను తీసుకెళ్తున్న సందర్భంలో స్థానిక రైతాంగానికి సాగు నీరు అందించాలన్న వాదనను స్థానిక ప్రజాప్రతినిధులు ఎవ్వరు ఇక్కడి వ్యవసాయానికి సాగునీరు ఇచ్చిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాలని గళం వినిపించకపోవడం ఇప్పుడు రైతుల వ్యవసాయానికి పెద్ద ముప్పును తీసుకొచ్చి పెట్టింది. నీళ్లు మనవి, భూములు మనవి సేద్యం మాత్రం పక్క జిల్లాల రైతులు చేస్తుంటే ఇక్కడ రైతులు తెల్ల మొహాలు వేసుకొని చూస్తున్నారు. కనీసం ప్రాజెక్టు పక్కనే ఉన్న తుమ్మలచెరువుకైనా సాగినీరు అందించే సౌలభ్యతను కల్పించినట్లయితే సుమారు 4266 ఎకరాలకు గోదావరి నీళ్లు పారేవి. దీంతో మండలంలోని అగ్ర భాగాన వరి పంటలు పండేవి. నాటి తప్పిదం వలన నేడు నీళ్లు పారుతున్న సేద్యానికి సుక్కనిరందుక మాగానులు కాస్త మెట్ట పైరులు పండే చెలకలుగా తయారయ్యాయి.

**ఆగస్టు 15 నాటికి తుమ్మలచెరువుకు నీళ్లు ఇవ్వడం కష్టమే :?**

వచ్చేనెల ఆగస్టు 15 నాటికి ఎట్టి పరిస్థితుల్లో తుమ్మలచెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా రోల్లపాడుకు వెళుతున్న పైప్ లైన్ నుండి తుమ్మలచెరువు నీళ్లు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఇంకా ఆగస్టు 15 కు సరిగ్గా 20 రోజుల కాలమే ఉన్నది. సీతారామ కాలువ వద్ద రోల్లపాడు ప్రాజెక్టుకు పంప్ హౌస్ నిర్మాణ పనులు చాలా వరకు మిగిలి ఉన్నాయి. మరో నెల రోజులైనా ఈ పనులు పూర్తయి మోటర్లు అమర్చే పరిస్థితి కనిపించడం లేదనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మరి ఆగస్టు 15 నాటికల్లా మంత్రి ఆదేశాలు అమలైతయా..? తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందో లేదో చూడాల్సిందే.

## మీసేవ నిర్వాహకుడిపై తహసిల్దార్‌కు ఫిర్యాదు



**అశ్వాపురం, విశాల భారతి :** అశ్వాపురం మండల కేంద్రంలో మీ సేవ నిర్వహిస్తున్న ఓ నిర్వాహకుడు రైతుల భూములకు చెందిన గోప్యత బహిర్గతం చేయడంతో పాటు రైతులను ఆందోళన కలిగేలా చేస్తున్నాడని ఆనదాపురం గ్రామానికి చెందిన రైతు ఆసా శ్రీనివాసరావు శనివారం తహసిల్దార్ సూర్యప్రకాశ్ కు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆ రైతు మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం మీ సేవ నిర్వాహకుడు నెల్లిపాక రెవెన్యూ లో సుమారు 300 పట్టాదార్ పాస్ పుస్తకాలు, అలాగే ఇతర ప్రాంతాల్లో మరో 200 అక్రమ మార్గంలో పాస్ పుస్తకాలు గత తహసిల్దార్లు, ఆర్ఐ లు చేశారని సామాజిక మాధ్యమంలో వైరల్ చేశాడని దీంతో అనేక మంది రైతులు ఆందోళన చెందారని తెలిపారు. అదే విధంగా తమ ప్రెస్ క్లబ్ దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయని తెలపడం ద్వారా క్రయవిక్రయాలకు తీవ్రమైన ఆటంకం కలిగిందని అందువలన ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా వినతి పత్రం ద్వారా తహసిల్దార్ కి అందజేసినట్లు ఆయన తెలిపాడు.

## యూటర్న్ తీస్తుండగా టిప్పర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



**పాల్వంచ విశాల భారతి**: పాల్వంచ మండలం పరిధిలోని పాల్వంచ-కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామానికి చెందిన బొగ్గం భద్రయ్య తన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని షోరూంలో మరమ్మతులు చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో లారీ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ సమీపంలో యూటర్న్ తీస్తుండగా వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన భద్రయ్యకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శ్రీనివాస్ కాలనీలో హమీద్ పటేల్ పాదయాత్ర

**డ్రైనేజీ సమస్య పరిష్కారానికి హామీ**



**శేరిలింగంపల్లి విశాల భారతి :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ శనివారం విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. కాలనీవాసులతో కలిసి ప్రతి వీధిలోనూ పర్యటిస్తూ వారిని ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్య తీవ్రంగా వేధిస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై తక్షణమే స్పందించిన హమీద్ పటేల్, సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ అవుట్‌లెట్‌ను అత్యవసరంగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో కొండాపూర్ డివిజన్‌లోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని స్పష్టం చేస్తూ,ఈ డ్రైనేజీ సమస్యను కూడా అతి త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని స్థానికులకు గట్టి హామీ ఇచ్చారు.ఈ పాదయాత్రలో స్థానిక నాయకులు బొక్క వీరబ్రహ్మం, కొప్పు కృష్ణయ్య, అందేపల్లి నాగమణి, నర్సింగరావు, జయరాములు, బాబాయ్, కన్నయ్య, మున్నీ, జయమ్మ, ఇందిర, బీవీ లక్ష్మి, గౌరమ్మ, అక్బర్, సత్తిరెడ్డి, సందీప్, అరవింద్ లతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణ సువర్ణ అవకాశం

**పీఏసీ ఛైర్మన్ గాంధీ**



**హైదర్‌నగర్ విశాల భారతి:** ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. హైదర్ నగర్ డివిజన్ అల్లాపూర్ సొసైటీ కాలనీలో శనివారం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్యుమరేషన్ ఫారంలో పూర్తి వివరాలు నింపి, సంతకం చేసి బూత్ లెవల్ అధికారులకు అందజేయాలన్నారు. జూలై 24 వరకే అవకాశముందని, ఫారం ఇచ్చిన వెంటనే అధికారి నుండి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లు అధికారులకు సహకరించి ఓటు నమోదు పెంచేలా కృషి చేయాలన్నారు. ఓటు హక్కు లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోయే ప్రమాదముందని హెచ్చరించారు.

## విదేశీ యువతిపై వేధింపులు

- కొండాపూర్‌లో కలకలం రేపిన ఘటన.. డచ్ మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు
- స్నేహితుడి ఫ్లాట్‌లోనే అసభ్య ప్రవర్తన.. గచ్చిబౌలి పోలీసుల దర్యాప్తు

**సైబరాబాద్ విశాల భారతి:** కొండాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో డచ్ దేశానికి చెందిన మహిళపై వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్నేహితుడి నివాసంలో బస చేస్తున్న సమయంలో అదే ఫ్లాట్‌లో ఉంటున్న వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌కు చెందిన యెలెనా లిసెంకా కేస్ (36) ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్‌కు వచ్చింది. కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్ సమీపంలోని ఏషియన్ సన్‌సిటీ అపార్ట్‌మెంట్‌లో తన స్నేహితుడు ప్రజేయ్ నాగ్దేవ్ నివాసంలో బస చేసింది. అదే ఫ్లాట్‌లో ఆదిత్య ఆనంద్ అనే వ్యక్తి కూడా ఉంటున్నాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు, ప్రజేయ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ ఆమెను మాటిమాటికీ అనుచితంగా గమనిస్తూ, అవాంఛితంగా స్పర్శించేందుకు ప్రయత్నించేవాడని పేర్కొంది. మార్చి 17న వంటగదిలో ఒంటరిగా ఉన్న సమయంలో అర్ధనగ్నంగా వచ్చి తనపై భౌతికంగా దాడి చేసేందుకు యత్నించాడని ఫిర్యాదులో తెలిపింది. అదే సమయంలో ప్రజేయ్ ఇంటికి రావడంతో పరిస్థితి మరింత విషమించకుండా తప్పించుకున్నట్లు వెల్లడించింది.ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితురాలు వెంటనే స్వదేశానికి వెళ్లిపోయింది. అనంతరం కూడా తన గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్లు తెలిసి డచ్ ఎంబసీ అధికారులను ఆశ్రయించింది. వారి సూచనల మేరకు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్న ఆమె జూలై 23న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు చేసింది.విదేశీ మహిళకు సంబంధించిన సున్నితమైన కేసుగా పరిగణించిన పోలీసులు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తూ నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రంగ్రేజీ బజార్‌కు అమ్మవారి ఘటం

**6వ రోజు ఘనంగా లష్కర్ బోనాల వేడుకలు**



**సికింద్రాబాద్, విశాల భారతి :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఆషాడ బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆరవ రోజు శనివారం అమ్మవారి ఘటం మేళాతాళాలు,పోతరాజుల నృత్యాల మధ్య రంగ్రేజీ బజార్ లోని అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ భక్తుల నుంచి పూజలు అందుకొని, తిరిగి రాత్రికి ఉజ్జయిని టెంపుల్ కు చేరుకుంది. అలాగే ఉదయం ఆలయ పండితులు అమ్మవార్లకు మహాహారతిని ఇచ్చారు. శనివారం అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా, ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి తెలిపారు.

## ప్రతి పౌరుడు ఒక్క మొక్క నాటాలి



- అనుమతి లేకుండా చెట్లు నరికితే కఠిన చర్యలు
- సర్పంచ్ పూనెం కృష్ణ, అటవీ శాఖ రేంజ్ అధికారి జస్వంత్

**భద్రాచలం , విశాల భారతి;**

పర్యావరణ పరిరక్షణకు ప్రజలను భాగస్వాములను చేయడం, భద్రాచలాన్ని పచ్చని పట్టణంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో ఈ ఏడాది నాటేందుకు తీసుకువచ్చిన వివిధ రకాల భారీ నీడనిచ్చే మొక్కలను శనివారం గ్రీన్ భద్రాద్రి సభ్యులు, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిశీలించారు. మొక్కల నాణ్యత, సంరక్షణ, నాటే ప్రాంతాల ఎంపిక, నిర్వహణ, రాబోయే వృక్షారోపణ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ, గ్రీన్ భద్రాద్రి చేపట్టే ప్రతి పర్యావరణ కార్యక్రమానికి గ్రామపంచాయతీ, ఉపాధి హామీ పథకం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి పౌరుడు కనీసం ఒక్క మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను తీసుకుంటేనే భద్రాచలాన్ని పచ్చని, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.అటవీ శాఖ రేంజ్ అధికారి జస్వంత్ మాట్లాడుతూ, సంబంధిత శాఖ అనుమతి లేకుండా చెట్లను నరికివేస్తే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు ఆర్. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని పట్టణవ్యాప్తంగా విస్తృత స్థాయిలో మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీ సావిత్రి, మాజీ అధ్యక్షులు గోళ్ళ భూపతి రావు, కామిశెట్టి కృష్ణార్జున రావు, బోనాల నాగ సూర్యనారాయణ, బెల్లంకొండ రాంబాబు, ఉమాశంకర్ నాయుడు, ప్రజా సంబంధాల అధికారి సంపత్, అటవీ శాఖ అధికారులు, వార్డు సభ్యులు, వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో "ప్రతి పౌరుడు ఒక్క మొక్క నాటుదాం పచ్చని భద్రాద్రిని నిర్మిద్దాం అనే నినాదంతో మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు.

## యూఎస్ వీసా కోసం నకిలీ పాస్‌పోర్ట్.. కాన్సులేట్‌ను మోసగించే యత్నం

- హైదరాబాద్‌లో కేసు నమోదు..
- ఏజెంట్ కోసం గాలింపు
- నకిలీ యూఎస్ పాస్‌పోర్ట్ కాపీ సమర్పించిన నిజామాబాద్ వ్యక్తి

**సైబరాబాద్ - విశాల భారతి**

అమెరికా వీసా పొందేందుకు నకిలీ యూఎస్ పాస్‌పోర్ట్ కాపీని సమర్పించి కాన్సులేట్ అధికారులను మోసగించేందుకు ప్రయత్నించిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన అమెరికా కాన్సులేట్ అధికారులు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నకిలీ పత్రాలు సమకూర్చిన ఏజెంట్ కోసం పోలీసులు గాలింపు చేపట్టగా, ఈ వ్యవహారం వెనుక మరింత పెద్ద ముఠా ఉందా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం వన్నెల్ బి గ్రామానికి చెందిన మేరుగు రమణగౌడ్ (45) ఈ నెల 24న హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్‌లో బి1/బి2 వీసా కోసం ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. వీసా దరఖాస్తుతో పాటు మేరుగు మహేందర్ గౌడ్ పేరిట ఉన్న 742730168 నంబర్ గల యూఎస్ పాస్‌పోర్ట్ ఫోటోకాపీని సమర్పించాడు. పత్రాలను పరిశీలించిన కాన్సులేట్ అధికారులకు పాస్‌పోర్ట్‌పై అనుమానం రావడంతో దానిని ఓవర్సీస్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్స్ (ఓసీఐ) విభాగానికి పంపించారు. ఓసీఐ అధికారులు రమణగౌడ్‌ను ప్రశ్నించగా, ఆ పాస్‌పోర్టుకు సంబంధించిన వివరాలను చెప్పడంలో అతడు విఫలమయ్యాడు. పాస్‌పోర్ట్ ఎవరికి చెందినది, తన వద్దకు ఎలా వచ్చిందనే విషయాల్లో స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోయాడు. అనంతరం రాజు అనే ఏజెంట్ తనకు ఆ పాస్‌పోర్ట్ కాపీ ఇచ్చాడని, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియవని వెల్లడించాడు.దీంతో పాస్‌పోర్ట్‌ను నిపుణులతో పరిశీలింపజేయగా అది పూర్తిగా నకిలీ పత్రంగా నిర్ధారణ అయింది. అమెరికా వీసా పొందేందుకు, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో ప్రయోజనం పొందేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ నకిలీ పత్రాన్ని సమర్పించినట్లు అధికారులు గుర్తించారు.ఈ ఘటనపై అమెరికా కాన్సులేట్‌లోని రీజనల్ సెక్యూరిటీ ఆఫీస్‌కు చెందిన ఓవర్సీస్ క్రిమినల్ ఇన్వెస్టిగేటర్ బ్రియాన్ గ్రెజిక్ హైదరాబాద్ పోలీసులకు అధికారిక ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాల తయారీ, వాటి వినియోగం, మోసపూరిత చర్యలతో పాటు అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు ఉన్నందున బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన ఫిర్యాదు మేరకు జూలై 24న మధ్యాహ్నం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 340(1), 336(1), 318(4), 319(2), 61(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద ఉన్న భారత పాస్‌పోర్ట్ నంబర్ AS655020గా గుర్తించారు. నకిలీ పత్రాలు సమకూర్చిన రాజు అనే ఏజెంట్‌ను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ తరహా నకిలీ పత్రాల ద్వారా విదేశీ వీసాలు ఇప్పిస్తామని మోసం చేసే ముఠా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.అమెరికా వీసా కోసం నకిలీ పత్రాలు సమర్పించడం తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అమెరికా కాన్సులేట్ అధికారులు స్పష్టం చేశారు. విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఎలాంటి నకిలీ ధ్రువపత్రాలు లేదా తప్పుడు సమాచారం సమర్పించవద్దని, గుర్తింపు పొందిన మార్గాల ద్వారానే వీసా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వారు సూచించారు.

## చెత్తలో కాదు.. చక్కని ఉపయోగంలోకి పాత ఫర్నిచర్

**పునర్వినియోగానికి సీఎంసీ ప్రోత్సాహం.. సుస్థిర నగర నిర్మాణానికి కొత్త అడుగు**



**పాత ఫర్నిచర్ పునర్వినియోగంపై అధికారులతో చర్చిస్తున్న సీఎంసీ కమిషనర్ సృజన,ప్రతినిధులు**


**సైబరాబాద్ విశాల భారతి :** పాత ఫర్నిచర్‌ను వ్యర్థంగా పారేయకుండా పునర్వినియోగం చేసే సంస్కృతిని ప్రోత్సహించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ల్యాండ్‌ఫిల్‌లకు చేరే వ్యర్థాలను తగ్గించి సహజ వనరులను సంరక్షించే సర్క్యులర్ ఎకానమీ విధానంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఇళ్లలో, అపార్ట్‌మెంట్‌లలో, కార్యాలయాల్లో ఉపయోగంలో లేని ఫర్నిచర్‌ను మరమ్మతులు చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకురావడం లేదా రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా వ్యర్థాల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చని సీఎంసీ పేర్కొంది. దీంతో కలప, లోహం వంటి విలువైన వనరుల వినియోగం కూడా తగ్గుతుందని వివరించింది.ఈ సందర్భంగా ఐకియా ఇండియా నిర్వహిస్తున్న "బై బ్యాక్ అండ్ రీషాప్" కార్యక్రమాన్ని సీఎంసీ అభినందించింది. వినియోగదారుల నుంచి సేకరించిన అర్హత కలిగిన పాత ఫర్నిచర్‌ను మరమ్మతులు చేసి తిరిగి విక్రయానికి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పునర్వినియోగానికి మంచి వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తోందని తెలిపింది.పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాత వస్తువులను పారేయకుండా సాధ్యమైనంత వరకు తిరిగి వినియోగించే అలవాటు పెంపొందించాలని, ఇందుకు ప్రజలు, సంస్థలు, వ్యాపార వర్గాలు భాగస్వాములు కావాలని సీఎంసీ పిలుపునిచ్చింది.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా అత్యంత కీలకం

- ప్రతి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి
- కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి

**విశాలభారతి, ఇబ్రహీంపట్నం:** ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బాధ్యత విధంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి అన్నారు.యాచారం మండల కేంద్రంలోని డిఎస్ఆర్ గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో మండలంలోని 59 బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ఎస్ఐఆర్ కార్యక్రమా ఇన్చార్జ్ కృష్ణచైతన్య రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనది. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడడం, తప్పులను సరిచేయడం, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై పూర్తి అవగాహన కలిగి బాధ్యతాయుతంగా పని చేయడం ప్రతి కాంగ్రెస్ నాయకుల కార్యకర్తల బాధ్యతని అన్నారు.ఈ సమావేశంలో సర్ ప్రక్రియ, బిఎల్ ఎ విధులు, బూత్ వారీ కార్యాచరణ, ఓటరు జాబితా పరిశీలన, ప్రజలకు అందించాల్సిన సహాయం ఎన్నికల సన్నద్ధతపై సమగ్రంగా చర్చించారు.బలమైన బూత్‌లే కాంగ్రెస్ విజయానికి పునాది. ప్రతి ఓటరిని చేరుకుందాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దామని అన్నారు. బిఎల్ఏలు తమ బూత్ లో ఉన్న ప్రతి ఇంటికి మూడుసార్లు తిరిగి ఏ ఒక్క ఓటర్ కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు చిత్తశుద్ధితో పనిచేసే రాబోవు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడానికి ప్రతి బి ఎల్ ఏ ప్రతి ఓటరు ను తట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, డిసిసి ఉపాధ్యక్షులు ముత్యాల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుబిల్లకంటి శేఖర్ రెడ్డి, సర్పంచ్లు అచ్చన మంగా జంగయ్య, కేశమోని రాజు, మస్కు అనిత శరణం, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్ ,నియోజకవర్గ ఉపాధ్యక్షులు గౌరిగే హరికిషన్, మండల అధ్యక్షులు పాశం జయప్రకాష్,మాజీ ఎంపీటీసీలు లక్ష్మీపతి గౌడ్, భారతమ్మ ఈశ్వర్, సూపర్వైజర్లు చీర శేఖర్ , కోరే జగదీష్ రావు, నాయిని శ్రీకాంత్ వివిధ గ్రామాల అధ్యక్షులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులుగా తోడుపునూరి వెంకటేశం



**విశాలభారతి, సిద్ధిపేట:** ఇటీవల బీజేపీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన తోడుపునూరి వెంకటేశం, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ తో కలిసి మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కి మరియు ఎంపీ రఘునందన్ రావు కి వెంకటేశం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, అలాగేసిద్దిపేట జిల్లాలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని వెంకటేశం పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో పార్టీ అభివృద్ధి, రాబోయే కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

## హీరోయిన్ కథలపై మాళవిక మోహనన్

# ఇంట్రెస్టింగ్ కామెంట్స్..!

ఇండియన్ సినీ పరిశ్రమలో లేడీ దర్శకులు, రచయితల సంఖ్య పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ హీరోయిన్ మాళవిక మోహనన్ అభిప్రాయపడింది. ప్రముఖ 'వెరైటీ ఇండియా' ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమలో మహిళా మేకర్స్ తక్కువగా ఉండటం వల్లే ప్రధాన స్రవంతి సినిమాల్లో స్త్రీ పాత్రలు పరిమితంగా, ఒకే రకంగా ఉంటున్నాయని అన్నారు. "మనకు 'ఫీమేల్ గేజ్' నుండి వచ్చే కథలు చాలా అవసరం. ఎక్కువ మంది మహిళా దర్శకులు వచ్చినప్పుడు, వారు ఖచ్చితంగా వైవిధ్యమైన, ఆసక్తికరమైన యాక్షన్ పాత్రలను రాస్తారు. అప్పుడే మనకు భారతీయ వెర్షన్ 'కిల్ బిల్' లాంటి పవర్ ఫుల్ సినిమాలు వస్తాయి" అని మాళవిక ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో అమీర్ ఖాన్ నిర్మాణంలో వచ్చిన 'లాపతా లేడీస్' చిత్రాన్ని మాళవిక ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ సినిమాలో మహిళా పాత్రలను చూపించిన విధానం తనకు ఎంతగానో నచ్చిందని చెప్పారు. రాబోయే రోజుల్లో కేవలం గ్లామరస్ ("ఫ్లవర్ పాట్") పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యం ఉన్న విభిన్నమైన పాత్రలను ఎంచుకోవాలని భావిస్తున్నట్లు 'ది రాజా సాబ్' నటి స్పష్టం చేశారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.